క్లుప్తంగా

మట్టి తరలించిన వారిపై కేసు నమోదు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని పుల్లాయి కుంట నుంచి అధికారుల అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండడంతో బుధవారం సాక్షి దిన పత్రికలో'అక్రమంగా కుంట మట్టి తరలింపు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. మట్టి తరలించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డీఈ ఖాసీం ఆదేశాల మేరకు ఏఈ రఘు బుధవారం స్థానిక సీఐ నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఐబీ అధికారుల ఫిర్యాదు మేరకు మట్టిని తరలించిన వారిపై, ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని సీఐ నవీన్‌కుమార్ సాక్షి కి తెలిపారు.

దూర విద్యలో కొత్త కోర్సు

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణంలోని ఉమెన్స్ కాలేజీ అంబేద్కర్ దూర విద్యాకేంద్రం లో నూతనంగా ఎంబీఏలో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు ప్రవేశపెట్టినట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ సుంకరి రాజారామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐసెట్ దరఖాస్తు చేయనివారు, అర్హత సాధించని వారు ఎంబీఏ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'భూమిని ఆక్రమించలేదు'

కనగల్ : తాను ఎవరి భూమిని ఆక్రమించలేదని కనగల్ మాజీ సర్పంచ్ చిట్ల లింగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనగల్‌లోని సర్వే నంబర్ 627లో నీలకంఠం ములసయ్య, లింగయ్య వద్ద 9గుంటల 12గజాల భూమిని 30 ఏళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో కొనుగోలు చేసి పట్టా చేసుకున్నట్లు తెలిపారు. ఈ స్థలంలోనే 20 ఏళ్ల క్రితం నిర్మించిన బ్యాంకు నేటికీ కొనసాగుతోందన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నార్కట్‌పల్లి : కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ పులి సైదులుతో కలిసి కుల సంఘాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి మాట్లాడారు. ప్రతి కుల సంఘానికి మండల కేంద్రంలో భవనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వారివెంట ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ ఐతరాజు యాదయ్య, రాధరపు భిక్షం, సైదులు, నడింపల్లి నరేష్, ప్రజ్ఞాపురం శ్రీను, సత్తయ్య, అమరవాది రాజు, నడింపల్లి మహేష్, మచ్చ నరేష్, రమేష్ , రాంబాబు తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టులో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో కాలువ తవ్వకాల్లో భూమి కోల్పోయిన మండలంలోని రైతులకు తహసీల్దార్ సైదులు బుధవారం నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. చౌడంపల్లి, ఔరవాణి, బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన 30 మంది రైతులకు చెక్కులు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ తరుణ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కులు అందజేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా కేంద్రం బర్కత్‌పురలోని న్యూ స్టాక్ ఫ్రూట్ కంపెనీ కోల్డ్ స్టోరేజ్‌లో ఇథిలిన్ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతిచెందిన కలీం, సాజిద్ కుటుంబాలకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున అందజేయించారు. గాయపడిన సలీమాకు రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆమేర్, ఇంతియాజ్, బాబా, సమత్, కలీల్, నాయకులు మధు, మహ్మద్ కలీల్, ఇంతియాజ్, అఫ్జల్ ఖాన్, తాహెర్, మామిడి కా ర్తీక్, నాగరాజు, జహంగీర్, ముజీబ్ సమీవుల ఖా ద్రి, ఇర్ఫాన్, రహీం , తబ్రేజ్, మొయినా పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : మండలంలోని అన్నారెడ్డిగూడెంలో బత్తుల ముత్తమ్మ ఇటీవల మృతి చెందింది. బుధవారం ఆమె దశదిన కర్మలో ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ పాల్గొని బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు.

చిట్యాల : పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు జిట్ట చిన్నస్వామి తల్లి నర్సమ్మ ఇటీవల క్యాన్సర్ బారినపడింది. ఆమెను బుధవారం టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్ పరామర్శించి రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు.

నార్కట్‌పల్లి : శాపల్లి గ్రామానికి చెందిన నిమ్మనగోటి సత్తయ్య కుమారుడు 9 రోజుల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో రూ.10 వేలను మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి బుధవారం అందజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మర్రిగూడ : 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను మైనార్టీ యువత సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. మైనార్టీ యువతకు ప్రభుత్వం నుంచి మంజూరైన సబ్సిడీ రుణాల చెక్కులను మంగళవారం నల్లగొండలోని వీటీ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఇస్తున్న సబ్సిడీ రుణాలతో ఉపాధి అవకాశాలను సృష్టించుకుని పది మందికి అవకాశాలు కల్పించాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ చైర్మన్ పంకజ్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నల్లగొండ టూటౌన్ : పండ్లను మాగపెట్టే ఏసీ ఇథిలిన్ గ్యాస్ పేలిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బర్కత్‌పురలో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అవసరమైన ఆధునిక పరికరాలు సమకూర్చి మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టీ.హరీశ్‌రావును నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి మంత్రితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మైక్రోస్కోప్ రెండు మిషన్లు, సర్జికల్ ఎక్విప్‌మెంట్‌లను త్వరగా పంపించే ఏర్పాటు చేయాలని కోరారు. ముగ్గురు డాక్టర్లు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నందున ఇబ్బందులు పడాల్సి వస్తోందని రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిత్యానంద ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల వినతి

రామగిరి(నల్లగొండ) : న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్లగొండ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు నేతి రఘుపతి, కట్టా అనంతరెడ్డి, ఆదిరెడ్డి, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

కేతేపల్లి : గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా పని చేయాలని కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

సమస్యలు ప్రస్తావించిన సభ్యులు

సమావేశంలో అధికారులు ప్రగతి నివేదిక చదువుతుండగా చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు కలుగజేసుకుని గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, ఏమేరకు పరిష్కరించారో తెలపాలని, ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కూడిన కమిటీ వచ్చే నెల 3న గ్రామంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రతి నెల మండలానికి వేల లీటర్ల సబ్సిడీ కిరోసిన్ వస్తుందని అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నారని, కానీ ఏఒక్క డీలర్ వద్ద కిరోసిన్ అందుబాటులో లేదని భీమారం ఎంపీటీసీ బడుగుల రవీందర్ సభలో ప్రసావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు పర్యవేక్షించాలని జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్ సూచించారు. గుడివాడ గ్రామంలో వ్యవసాయ భూముల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో ఏఈకి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని సర్పంచ్ కట్ట శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఆరు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయక పోవడంతో తాగునీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని కాసనగోడు ఎంపీటీసీ ఇందిర తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ చినబొస్క మాధవి, మండల కోఆప్షన్ సభ్యుడు అవ్వారి శౌరయ్య, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, తహసీల్దారు మధుసూన్‌రెడ్డి, వైద్యాధికారి అర్చన, ఏఓ బి.పురుషోత్తం, పశు వైద్యాధికారి నవజీవన్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు మౌనిక, గ్రాబ్రియేల్, ఏపీఎం బి.యాదమ్మ, ఏపీఓ సురేందర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్

సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మమ్మ

శాలిగౌరారం : మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ గంట లక్ష్మమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లక్ష్మమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోగా కనీసం ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను కూడా సమావేశానికి అందించకపోవడం గమనార్హం. మండల అధికారులు సమావేశంలో లేకపోవడంతో ప్రధాన సమస్యలు చర్చకు రాలేదు. దీంతో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారుల నిర్లక్ష్యం తీరును ఎత్తిచూపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడంలేదని సభ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ఇటుకులపహాడ్ రోడ్డు అధ్వానంగా మారిందని, రోడ్డు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, అదేవిధంగా గ్రామంలోని చెరువు విస్తీర్ణంపై సర్వేచేసి చెరువు శిఖాన్ని కాపాడాలని ఆ గ్రామ సర్పంచ్ అల్లి సైదులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని గ్రామాలకు నిధులు సమానంగా కేటాయించి అభివృద్ధి పనులు జరిగేలా ప్రణాళికలను రూపొందించాలని పలువురు సర్పంచ్‌లు సభలో ప్రస్తావించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎర్రబెల్లి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జూలై 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ): ఆగస్టులో జరగబోయే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) ద్వితీయ సంతవ్సరం, ఫెయిల్ అయిన (2019–21, 2020–22) బ్యాచ్‌లకు చెందిన అభ్యర్థులు జూలై 10 తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 18వ తేదీలోపు రూ.50ల ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

జిల్లా కోర్టులో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ నల్లగొండ, హైదరాబాద్ శ్రీధరీయం ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో న్యాయవాదులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయుర్వేద మందులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, సెక్రటరీ జెనిగల రవి కుమార్, ఉపాధ్యక్షుడు లాల్‌బహదూర్ గౌడ్, మోరె ప్రవీణ్‌కుమార్, పెరుమాళ్ళ శేఖర్, కామేశ్వర్, కీసర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : చండూరు పట్టణానికి చెందిన చండూరు ఆస్పత్రి ఆధ్వర్యంలో దామెరభీమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బుధవారం ఎంపీటీసీ సిలివేరు విష్ణు ప్రారంభించారు. డాక్టర్ శివాజీ, మేనేజర్ శశి, ఇరగోని రవియాదవ్, మునగాల నాగిరెడ్డి, అంబల్ల రవిగౌడ్, కాస శంకర్, మునగాల వెంకట్‌రెడ్డి, గిరి, రాఘవరెడ్డి, రాంరెడ్డి, సత్తిరెడ్డి, బూసన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కనగల్ : అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ జూలై 3న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రజలకు పిలునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలగుడు ప్రభావతి, మండల కార్యదర్శి కందుల సైదులు, సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, సోషల్ మీడియ కన్వీనర్ మహ్మద్ అక్రం, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా యాదగిరిరెడ్డి



చిట్యాల : మండలంలోని ఎలికట్టె గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌తో పాటు రెండు డైరెక్టర్ స్థానాలకు బుధవారం ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా గుత్తా యాదగిరిరెడ్డి ఎన్నికయ్యారు. ఆయన వరుసగా 29 వసారి ఆ గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన డైరెక్టర్‌లుగా సాగర్ల పరమేశం, ఉయ్యాల లింగయ్య ఎన్నికయ్యారు. సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ గొలనుగొండ దశరథ, మాజీ సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' ని జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : బీసీల డిమాండ్ల సాధన కోసం జూలై 14,15 తేదీల్లో తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో బీసీలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నేరటి మల్లేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ఏ పంటలు వేసుకోవాలి, ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేసినప్పటికీ రైస్ మిల్లుల వద్ద కోతలు విధించారని ఓగోడు ఎంపీటీసీ లోడే సాగర్ తెలిపారు. చందుపట్లలో ఉపాధి హామీ కూలీల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీ వెంకన్న సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అండాలు, తహసీల్దార్ ప్రసాద్‌నాయక్, ఎంఈఓ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మత సామరస్యాన్ని కాపాడాలి

నల్లగొండ క్రైం : ప్రతిఒక్కరూ మతసామరస్యాన్ని కాపాడాలని డీఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి పండుగలను గౌరవించుకోవాలన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐ గోపి, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, నాయకులు హఫీజ్‌ఖాన్, ఏఏ ఖాన్, రఘుపతి, జాఫర్, హసీమ్, షరీఫ్, రఫీ, సలీమ్, జమాల్, బాబ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో శాంతి సంఘం సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింహారెడ్డి

నార్కట్‌పల్లి : ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్‌ఐ సైదాబాబు అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అన్ని మతాల పెద్దలతో నిర్వహించిన మైత్రి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, వాజిద్, దూదిమెట్ల వెంకటేశ్వర్లు, ప్రజ్ఞాపురం రామకృష్ణ, యాసిన్‌అలీ, నరేష్, శివ, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్ గిరిబాబు ఉన్నారు.

మునుగోడు : బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హిందూ ముస్లింలతోపాటు ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, ఎంపీఓ సుమతల, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి బాసటగా నిలిచిన అధికారులు

నకిరేకల్ : వృద్ధాప్యంలో బాగోగులు చూసుకునే వారు లేక శిథిలావస్థలో ఉన్న పాత గోడల మధ్య అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలిని అధికారులు నల్లగొండ మెడికల్ కళాశాలకు తరలించారు. వివరాలు.. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో 65 ఏళ్ల పైబడిన తరుణోజు అమృతమ్మకు భర్త చనిపోయాడు. ఒక కుమార్తె ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. తన పాత ఇంటిలోనే అమృతమ్మ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోంది. దీంతో స్థానిక అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ టోల్ ఫ్రీ నంబర్ 14567కు సమాచారం అందించింది. జిల్లా సంక్షేమ అధికారిని కె. వి.కృష్ణవేణి ఆదేశాల మేరకు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ అధికారి మునగాల నాగిరెడ్డి రెస్క్యూ వాహనంతో బుధవారం నోములకు వచ్చారు. వైద్యసహాయం నిమిత్తం నల్లగొండలోని మెడికల్ కళాశాలకు తరలించారు. తల్లిదండ్రులు పోషణ సంరక్షణ చట్టం 2007 ప్రకారం వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారి నాగిరెడ్డి తెలిపారు. తల్లిని నిర్లక్ష్యం చేసిన కూతురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

వృద్ధురాలిని చేరదీసిన అన్నపూర్ణ సేవా సమితి

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణానికి చెందిన అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు బుధవారం ఓ వృద్ధురాలిని చేరదీశారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం గ్రామానికి చెందిన లింగాల లక్ష్మి నల్లగొండ పట్టణంలో ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం గడుపుతోంది. వయసు మీరడంతో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఒంటరిగా జీవిస్తుంది. అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు సమాచారం ఇచ్చి పోలీసుల సహకారంతో దేవరకొండలోని మహాలక్ష్మి మహిళా మండలి ఆశ్రమంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల ఫీల్డ్ అధికారి నాగిరెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, సఖి సెంటర్ సభ్యురాలు మందాకిని, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

కేతేపల్లి : మండలంలోని చీకటిగూడెం గ్రామంలో అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. చీకటిగూడెం గ్రామంలో ఊర చెరువు వద్ద రూ.5లక్షల వ్యయంతో కాజ్‌వే నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఈ ఏడాది జనవరి 31న శంకుస్థాపన చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎమ్మెల్యే ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు తెలిపారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

నార్కట్‌పల్లి : రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాండ్ర గ్రామంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తరాల శ్రీనివాస్, పలపు బుద్దుడు, మల్లెబోయిన రమేష్, రామలింగయ్య, లింగస్వామి, మేడి గణేశ్, ప్రజ్ఞాపురం లింగస్వామి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

కనగల్ : మండల వ్యాప్తంగా గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనానికి పాల్పడుతున్నారు. బ్యాటరీలతోపాటు డీజిల్‌ను సైతం తీసుకెళ్తూ వరుస చోరీలకు పాల్పడుతున్నారని ట్రాక్టర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఎంపీటీసీ పాలకూరి సైదులుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీతోపాటు ట్రాక్టర్‌లో ఉన్న 50 లీటర్ల డీజిల్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సైదులుతో పాటు మరో 9 ట్రాక్టర్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితమే 5 ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లడంతో పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బుధవారం బ్యాటరీలు ఎత్తుకెళ్లిన విషయం తమ దృష్టికి రాలేదని ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న వివిధ బోధన సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 5వ తేదీలోపు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో..

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో హిందీ టీజీటీ, ఇంగ్లిష్ పీజీటీ ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి బుధవారం తెలిపారు. జూలై 1 వరకు దరఖాస్తుల స్వీకరణ, 2వ తేదీన డెమోతోపాటు అర్హత పత్రాల పరిశీలన చేయనున్నట్లు తెలిపారు.

కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

నల్లగొండ టూటౌన్ : ఒకటో పీఆర్సీ గడువు ఈ నెల 30తో ముగియనున్నందున జూలై ఒకటి నుంచి కొత్త పీఆర్సీని ప్రకటిస్తూ మధ్యంతర భృతి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర పరిశీలకుడు ఎంవీ. గోనారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెన్షన్‌దారుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి భాస్కర్‌రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, నూకల జగదీశ్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్, పాపయ్య, పెంటయ్య, బండి రాఘవరెడ్డి, కుకుడాల గోవర్ధన్, అబ్దుల్‌ఖాదర్, వెంకటేశ్వర్లు, వనం వాణిశ్రీ, రమేష్, కాశయ్య, కౌసల్య పాల్గొన్నారు.

యువతను మేల్కొలిపేందుకే క్విజ్ పోటీలు

నకిరేకల్ : హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో తెలంగాణ యువశక్తిని మేల్కొలిపేందుకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని క్విజ్ కాంపిటీషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంశెట్టి నరేందర్ తెలిపారు. నకిరేకల్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల సన్నాహక సమావేశంలో కాంపిటీషన్ ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్లు నకిరేకంటి ఏసుపాదం, సుంకరబోయిన నర్సింహ, నాయకులు వేదాసు శ్రీధర్, రాఘవరెడ్డి, రాజు, జలందర్‌రెడ్డి, విజయ్, శంకర్, జ్యోతి బసు, గణేశ్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎన్‌హెచ్‌బీ డిప్యూటీ డైరెక్టర్ రవికాంత్‌సింగ్

కట్టంగూర్ : నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బీ) పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌హెచ్‌బీ డిప్యూటీ డైరెక్టర్ రవికాంత్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామం గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో జాతీయ హార్టికల్చర్ పథకాలపై రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పామాయిల్, వర్షాకాలంలో కూరగాయలు, పండ్లు పండించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎన్‌హెచ్‌బీలో రైతులకు పలు రకాల పథకాలున్నాయని బ్యాంకు ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే అధికారులు పరిశీలించి 40 నుంచి 50 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. నల్లగొండ జిల్లా ఉద్యానవన పట్టుపరిశ్రమల అధికారి జి.సంగీతలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఫామాయిల్ మొక్కలు నాటేందుకు ఒక్కో ఎకరానికి రూ.4200 చొప్పున గరిష్టంగా 12.50 ఎకరాలకు డబ్బులు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం ఎం.వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, నెటాఫిన్ కంపెనీ దక్షిణ భారతదేశ అగ్రోనోమిస్ట్ సుబ్బారావు, రావుల విద్యాసాగర్, ఐఆర్‌డీఓ వి.రమేష్ ఉన్నారు.

ఎడమకాల్వ కట్ట పటిష్టతకు లైనింగ్ నిర్మాణం

హాలియా : నాగార్జునసాగర్ ఎడమ కాలువ కట్ట పటిష్టత కోసం లైనింగ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎన్‌ఎస్పీ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం హాలియాలో ఎడమకాల్వ కట్ట 16వ కిలోమీటర్ వద్ద జరుగుతున్న లైనింగ్ నిర్మాణ పనులను ఆయన ఈఈ లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ కాల్వ 16వ కిలోమీటర్ వద్ద కట్ట లైనింగ్ జారడంతో రూ.16 లక్షలతో లైనింగ్ పనులు చేపట్టామన్నారు. హాలియా మున్సిపాలిటీలోని ఎడమకాల్వ కట్టపై ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.8 కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనుల్లో కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాల్వ, చెరువు కట్టలపై వ్యర్థ పదార్థాలు, తినుబండరాలు, చెత్త వేయడంతో అవి తినేందుకు వచ్చే ఎలుకలు, పంది కొక్కులతో కట్ట పటిష్టతకు భంగం వాటిల్లుతోందన్నారు. ఎడమ కాలువ పరిధిలో 70వ కిలోమీటర్ వరకు 30 ప్రాంతాల్లో కాల్వ కట్ట మట్టి జారిపోయిందని.. లైనింగ్ నిర్మాణ పనులకుగాను సుమారు రూ.14 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు. ఎడమ కాల్వ కట్ట లైనింగ్ నిర్మాణ పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో డీఈ సంపత్‌కుమార్ ఎన్‌ఎస్పీ సిబ్బంది ఖాసీంఖాన్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

పీవీ బహుభాషా కోవిదుడు

● శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : ప్రధానమంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి భారతదేశ అభివృద్ధికి బాటలు వేసిన పీవీ.నరసింహారావు బహుభాషా కోవిదుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు జయంతి సందర్భంగా నల్లగొండలోని గుత్తా తన క్యాంపు కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ తెలంగాణలో జన్మించి ప్రధానమంత్రి అయిన పీవీ గొప్ప వ్యక్తి అని, ఆయన చేసిన సంస్కరణల కారణంగా భారతదేశం అభివృద్ధి చెందిందని తెలిపారు. పీవీ అనర్గళంగా 17 బాషల్లో మాట్లాడి అందరినీ ఆశ్యర్యానికి గురి చేసేవారని, ఆయన రాజకీయ నాయకుడే కాకుండా గొప్ప రచయిత అని తెలిపారు. త్వరలోనే పీవీ నరసింహారావు విగ్రహాన్ని నల్లగొండలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్ యామ కవితదయాకర్, నాయకులు ఐతగాని స్వామిగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరావు, యాదయ్య పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

ఆరు కొత్త బ్రాంచీలు ప్రారంభిస్తాం

● డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యంలో ఆరు నూతన బ్రాంచీలను త్వరలో మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంకులో జరిగిన మహాజన సభ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. మహాజన సభలో 2022–23 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదికను ఆమోదించామన్నారు. డీసీసీబీ లాభాల బాటలో పయనిస్తోందని.. బ్యాంకు గ్రేస్ ప్రాఫిట్ రూ.36.37 కోట్లు ఉండగా నెట్‌ప్రాఫిట్ రూ.15.47కోట్లు ఉందన్నారు. బ్యాంకు ఎన్‌పీఏ 1.36 శాతంగా ఉండి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, కొండ సైదయ్య, రంగాచారి, అంజయ్య, ప్రవీణ్‌రెడ్డి, వీరస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అప్పిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, డీఈఓ కె.మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి